చిత్రకారుని చిత్రాలు

శ్రీ కావుటూరు వెంకట నారాయణరావు

[చుట్టూ గోడలమీది చిత్రాలు చెయ్యానులును విపరీతంగా ఆకర్షించినవి — చిత్రకారుడెవరా అని గాలించసాగాడు. చిత్రకారుడు తటస్థపడ్డాడు — దట్టంగా పెరిగిన గడ్డం, తైలసంస్కారములేనిజుట్టు, దుమ్ము ధూళితోనిండిన చింపిగుడ్డలతో — అతని జీవితచరిత్రలో ఏదో గూఢమైన ప్రత్యేకతయుండి యుండాలనుకున్నాడు. గదికి తీసికొని వెళ్లి స్నానం, భోజనమయ్యాక చెయ్యానులు తనపక్కమీద చిత్రకారుని కూర్చోనబెట్టి అతని జీవితచరిత్రను తెలిసికోవాలనే ఆసక్తిని తెలిపాడు — తను పుట్టినప్పటినుండి నిరాధారులైనతను, తన అక్కయ్య ఎలా పెరిగింది. తన్ను పోషించడానికి తన అక్కయ్య పడ్డ పాట్లు — చివరకు ఆ గ్రామంనుండి సయితం లేచి పోవలసిన పరిస్థితులు - అక్కడనుండి బస్తీకి చేరి తన అక్క ఒక మహారాజింట్లో చాకిరికి కుదరడం, తాను తన యూహకందిన చిత్రాలను గీచి కొద్దో గొప్పో సంపాదనతో జీవయాత్ర సాగించు చుండటం — యిక చదువండి]

(గతసంచిక తరువాయి)

"నేను రచించిన బొమ్మలు చాలా అమ్ముడు పోతుండేవి. అందులకు నాకెంతో సంతోషంగా వుండేది. నేను రచించిన బొమ్మలు కొందరికి వూరికినే యిచ్చివేసేవాణ్ణి. కాని నా జీవితం యిలా అన్యాయం కావడానికి ఆ బస్తీయే పునాది వేసింది. మా జీవితం సుఖంగా గడిచిపోవడం ప్రకృతికి కళ్ళు కుట్టింది. మరల మా కష్టదశ ప్రేళ్ళు పెట్టసాగింది."

"మా అక్కయ్య పనిచేస్తున్న ఆ యింటి యజమానికి ఒకకొడుకున్నాడు. అతను కాషాయ వస్త్రాలు కట్టుకున్న బ్రహ్మచారి. మనసు ఆ దశలో లేదు. అతనొక గోముఖ వ్యాఘ్రం - పయోముఖ విషకుంభం. అతని గుట్టంతా మా అక్కయ్య తెలుసుకుని నాకు తెలిపింది. ఆ తుచ్ఛుని బందిబడకుండవుండమని మా అక్కయ్యను హెచ్చరించాను. అతని మాటంటే మా యిద్దరికీ చిరాకు కలిగించేది. అతను మా అక్కయ్య అక్కడ పనికి కుదిరినప్పటినుండి ఓ కన్ను వేశాడు. అది నాకు తెలిసిందికాదు. లేకపోతే అప్పుడే అతనిని కండను కండ విడదీసి ఆనందించేవాణ్ణి."

"నేనొక రోజు కంపెనీలో పనిజాస్తయినందున మా అక్కయ్యతో ఆ రోజు కంపెనీలో పడుకుంటానని చెప్పి వెళ్ళాను. ఆ మాటలతో యెందుకో మా అక్కయ్య సంకోచపడింది. నా మనసుకూడా యెందుకో తల్లడిల్లింది. మా వంటివారి జీవితాలు యెప్పుడూ యిలాంటి అపాయాలకు దురవస్థలకు గురికావడం సహజమే! నేనా ప్రొద్దున పోయినవాణ్ణి మరుసటిరోజు తెల్లవారిదాకా తిరిగిరాలేదు. ఈలోపల జరిగిన సంఘటనే నా జీవితానికి కఠిన పరీక్షయింది. ఆ సంఘటనే నా జీవితాన్ని యీ విధంగా మార్చివేసింది. నేను మరు రోజు ప్రొద్దున యింటికి

తిరిగి వచ్చాను. మా అక్కయ్య నాకగుపించలేదు. ఆమెకోసం ఆ యిల్లంతా వెదికాను. కానీ నాకెక్కడా ఆమె జాడే అగుపించలేదు. నా హృదయం భయంతో కంపించిపోయింది. విచారంతో తల్లడిల్లింది. తిరిగి తిరిగి నా దేహం కూలిపోయింది. ఆ రోజంతా నాకామెజాడ తెలియలేదు. నాకేమీ తోచక నా మంచంమీద వాలిపోయాను. ఆ మంచం మీదనే అగుపించింది మా అక్కయ్య వుత్తరం.”

“ఆ వుత్తరం చదువుతుంటే నా రక్తం వుడికిపోయింది. నా నాడులు వుబ్బిపోయాయి. ఆ తుచ్ఛుడు, నేనెవరినైతే అంతగా అనుమానించానో అతనే, ఆ యింటి యజమాని కుమారుడు మా అక్కయ్య జీవితం నాశనంచేశాడు. ఆమె ఆ రాత్రే ఆత్మహత్యచేసుకుంది.”

“అంతవరకు నా అని చెప్పుకోదగ్గ ఓ వ్యక్తి నా యెదుట వుండేది. ఆ వ్యక్తికూడా దూరమయింది. నేనుకూడా యీ లోకంనుండి దూరమౌదామనుకున్నాను. ఆ తుచ్ఛుడు యింకా యీ జగంలో జీవించి వున్నాడంటే నా హృదయం వుడికిపోయింది. ఆ రాత్రే అతనిని నిద్రబోతున్నపుడు పొడిచివేశాను. ఈ మాటలు మీకాశ్చర్యం కలిగించలేవు. ఆలోచించనుకూడా అవకాశమివ్వననుకుంటాను”

“అమాంతంగా, ఓ ప్రాణిని నా చేతులారా యీ లోకానికి దూరంజేశాను. అందుకు లోకం నాకు తగిన శిక్ష నాకు వేయలేదనుకుంటాను. నన్ను పట్టుకున్నారు. న్యాయస్థానంలో నేను హంతకుణ్ణని నిర్ధారణ జేశారు. ఆ నాడే నన్ను ఆ వూరి జైల్లో వేశారు.”

“నేనెప్పుడు జైలులో చేరానో నాకు తెలియదు. కానీ ఓ సంవత్సరంనుట్టుకు జైలు జీవితం అనుభవించాను. సర్వద్రోహులకు, అన్యాయాలకు స్థానమైన యీ సమాజ జీవితంకంటె ఆ జైలు జీవితమే నాకెంతో హాయినిచ్చింది. నా జీవితం ఆ జైలు కటకటాలలోనే అంతమొందించమని దేవుని ప్రార్థించాను. అక్కడ నా చిత్రకళకు యౌవనం అంకురించింది. నేను ఆ జైలు జీవితంలో యెందరినో చూచాను. వారి ప్రకృతులిలాంటివని అర్థంచేసుకున్నాను. వారిలో నాలాంటి హంతకులెందరో వున్నారు. కానీ వారి జీవితం నాతో పోల్చుకోదగ్గదిగాదు. యెప్పుడూ ఆ జైలులోగూడా యేకాంతంగా వుండాలని ఆశించేవాణ్ణి. కానీ నన్ను విడుదల చేశారు. మరలా యీ సమాజంలో అడుగుబెట్టాను.”

“నేనప్పటినుండి పిచ్చివానిలా తిరిగేవాణ్ణి. నన్ను లోకంకూడా పూర్తిగా పిచ్చివాణ్ణి చేసింది. నేనెన్నో వూర్లు తిరిగాను. నా పాప పరిహారంకోసం యెందరి దేవతల చిత్రాలో భక్తితో చిత్రించాను. కాని నా జీవితం యిలాంటిదని యెవ్వరికీ తెలిసిందిగాదు. నా పాపానికి పరిహారం యేమీ కనుపించలేదు. నా హృదయ భారం తగ్గించుకుందామన్నా నా కథ వినేవాడెవ్వడూ లేకపోయాడు. అంతటితో నా నోరు కట్టుబడిపోయింది; కాని నా మనసులో యే ఆలోచనలుండేవో నాకే తెలిసేదిగాదు”

“నేనెక్కడ కాలుపెట్టినా నన్ను చిత్రాలు వ్రాయమని బలవంతపెట్టేవారు. నాకు విసుగుకలిగి వారి మాటలు వినేవాణ్ణిగాదు. నా యిష్టమొచ్చినపుడు యే గోడమీదనో బొమ్మలు గీచేవాణ్ణి.”

“నేను పిచ్చివాణ్ణి కాకపోయనా యీ లోకం నన్ను పిచ్చివాణ్ణిగా చేసింది. ఇప్పుడు నేనొక యేకాకినయినందువలన నా పొట్టపోషించుకోడం నాకొక సమస్యగాదు. ఇదీ యిప్పటివరకు నా గాథ. ఇంకా నా అభూత జీవితంలో యెన్నో విషాద సంఘటనలు జరిగాయి. అవన్నీ చెప్తే మీకు కష్టంకలిగించినవాణ్ణిగా తయారవుతానేమో!”

ఆ చిత్రకారుడు తన చరిత్ర ముగించేటప్పటికి రాత్రి పదకొండు కొట్టింది. తన మంచంమీద ఆ చిత్రకారుడు నడుంవాల్చాడు. ఆ చిత్రకారుని సంఘటనలను, అతనిపట్ల సమాజంలో జరిగిన అన్యాయాన్ని గురించి ఆలోచించుకుంటూ తనూ మరోచాపమీద నడుంవాల్చాడు, చెయ్యానులు.

చెయ్యానులు ప్రొద్దుననే లేచాడు. తన కళ్ళు నిద్రనుండి తెరిచాడో లేదో జిగేలుమన్నాయి. తన యెదుటవున్న గోడ ముందు తెల్లగా వెల్లవేసి వుండేది. కానీ యిప్పుడా గోడమీద శేషశాయి పవ్వళించి వున్నాడు. తనగదిలోని మూడు ప్రక్కలా మూడు బొమ్మలు వేసివున్నాయి. ఒక తట్టు రవివర్మలక్ష్మి వేసివుంది. మరో ప్రక్క తన స్వరూపమేవుంది. చెయ్యానులు ఆశ్చర్యపోయాడు. తన పోలిక అంత బాగా వేయగలిగాడంటే అతని నైపుణ్యానికి తను విలువగట్టలేకపోతున్నాడు.

చెయ్యానులు ఆ చిత్రకారుని తన గదిలో చూడలేక పోయాడు. చుట్టుప్రక్కల యెక్కడా అగుపించ లేదు. తనతనిమీద యెన్నో ఆశలు పెట్టుకుని వున్నాడు. సాధ్యమయితే అతని నొక ప్రసిద్ధ చిత్ర కారునిగా లోకానికి పరిచయం చేయదలుచుకున్నాడు. అలాంటి ఆలోచనలన్నీ యెండమావులలా అగుపడి మాయమయ్యాయి.

ముందు తనగది దేనికీ కొరగాకుండా పడివుండేది. ఇప్పుడా చిత్రకారుని నైపుణ్యంవలన ఓ కళామండ పంలా తయారయింది. తన గదిని తెరచివుంచితే కొన్ని రోజులలో ఓ చిత్రవస్తు ప్రదర్శనశాల కాగ లదు. ఆ చిత్రకారుని సంచికూడా తన గదిలోనే వుంది. దానిలోవున్న బొగ్గులన్నీ మాయమయ్యాయి. వాటితోనే ఆ రాత్రి ఆ చిత్రకారుడు, తను నిద్ర పోతుంటే ఆ బొమ్మలు వ్రాసివుంటాడు. తన దుర దృష్టంవలన అతను చిత్రాలు వేసేటప్పుడు మెలుకువ రాలేదు. ఆ ఒక్క రాత్రిలో మూడు బొమ్మలు అంత మనోహరంగా యెవ్వరూ వేయలేరు. ఆ చిత్ర కారుని లాఘవానికి చెయ్యానులు ఆశ్చర్యపోయాడు.

ఆ నాడే తన బొమ్మ మునిసిపల్ మార్కెట్ గోడమీద కెక్కింది. చెయ్యానులుకేమీ తోచలేదు. తిరిగి అతనికోసం వెదక ప్రారంభించాడు. నాలు గైదు రోజులా యువక చిత్రకారుని కోసం మునిసిపల్ మార్కెట్ ముందు కాచుక్కూర్చున్నాడు. కాని ఆ చుట్టు ప్రక్కల ఆ చిత్రకారుని జాడేలేదు. అతని కోసం చెయ్యానులు వూరంతా తిరిగాడు. తనకు ప్రతి దినం ఓ క్రొత్త చిత్రం అగుపిస్తునేవుంది. దానివలన ఆ చిత్రకారుడు వూర్లోనే వున్నాడని తెలుసు కున్నాడు చెయ్యానులు. మరలా తన అన్వేషణ మరీ పట్టుదలతో సాగించాడు. కాని తన ప్రయత్నం విఫలమయింది. తుదకు నిరాశతో అతని చిత్రాలను చూస్తూ అతని మూర్తిని భావించుకొంటూ వుండే వాడు.

ఓ నెల రోజులు గడిచిపోయాయి. అప్పుడప్పుడు చెయ్యానులా చిత్రకారుని కోసం తిరిగే వాడు. ఓ నాడు చెయ్యానులు యేదో పనిమీద ట్రంకురోడ్డు గుండా బహు త్వరగా వెళ్తున్నాడు. వచ్చేపోయె కార్లకు, బండ్లకు, రిక్షాలకు తెరపిలేకుండావుంది. రోడ్డుమీద జనం కిటకిటలాడుతున్నారు. చెయ్యానులు ఓమూల తిరుగుడు దగ్గరకు వచ్చాడు. ఇంతలో రెండు కార్లు మోదుకున్నాయి. పెద్ద శబ్దమయింది. ఆ కార్లు నడుంగల ఓ మనిషి పడిపోయాడు. అందరూ గుమిగూడారు. చెయ్యానులు గూడా ఆ సంఘటను చూడడానికి వెళ్ళాడు.

ఆ కార్లక్రింద పడ్డమనిషి గుర్తు పట్టడానికి వీలు లేకుండా చితికి పోయడు. అందరూ అది ఓ వింతలా చూస్తున్నారేగాని యెవ్వరూ ఆ మనిషిని లేవదీసి హాస్పిటలుకు పంపేవారెవ్వరూ లేకపోయారు. చెయ్యానులుకు ఆ మూర్ఖులను చూస్తుంటే హృదయం తరుక్కుపోయింది.

చెయ్యానులు ఆ దెబ్బతిన్న వ్యక్తిని మెల్లగా ఆ కార్ల సందునుండి లెవదీయడానికి కొందరిని సహాయమడిగాడు. ఆ గుంపులో కొందరు సహాయం చేశారు. ఇంతలో పోలీసులు ఆ విషయం తెలుసుకు పోదామని వచ్చారు. వారివృత్తికి అదే ముఖ్యమయిన పనను కున్నాడు చెయ్యానులు !

చెయ్యానులు ఆ గాయపడ్డ వ్యక్తిని పరికించాడు. తలంతా చక్రాల సందున పడి ఆనవాలులేకుండా పోయింది. మెల్లగా అతనిని దీసి ఓ కారులో పరుండ బెట్టి తనూ కూర్చున్నాడు. ఆకారు గవర్నమెంట్

హాస్పిటలుకు బయలుదేరింది.

హాస్పిటలింకా సమీపించలేదు. ఆ దెబ్బతిన్న వ్యక్తి మెల్లగా కదిలాడు. చెయ్యానులు అతని ముఖాన్ని పరికించి — పరికించి చూచాడు. తన హృదయంలో ఆందోళన బయలు దేరింది. చెయ్యానులు అతనిని పూర్తిగా ఆనవాలు పట్టాడు. తన హృదయంలో ఆటంబాంబు పడ్డట్లయింది. అతనే ఆ చిత్రకారుడు.

అతను మెల్లగా కదులుతున్నాడు. యేదో కలవరింతగూడా వస్తూంది. ఇంకా కారు హాస్పిటలు చేరలేదు. చెయ్యానులు ఆ వ్యక్తి ఆరోగ్యం కోసం సర్వదేవతలకు మ్రొక్కుకున్నాడు. ఆ చిత్రకారుడు ఓ సారి తన కళ్ళు తెరచి చెయ్యానులు తట్టు చూచాడు. చెయ్యానులు ఆత్రంతో అతనికళ్ళతట్టు చూచాడు. యిద్దరి చూపులు కలుసుకున్నాయి. కారు హాస్పిటలు ద్వారం సమీపించింది. ఆ చిత్రకారుడు కళ్ళుమూశాడు. అతని ఆత్మజ్యోతి శూన్యంలో కలిసిపోయింది. చెయ్యానులు హృదయంలో చెలరేగిన తుఫాను తగ్గిపోయింది. తనకంటినుండి రెండు వేడి నీటి చుక్కలు అతని హృదయం మీద జారి పడ్డాయి.

చెయ్యానులు యిన్నాళ్ళుగా యెవరినైతే ఆశించాడో ఆ వ్యక్తి యీ లోకంనుండే దూరమయ్యాడు. లోకం తనచేతులతో ఓ ప్రసిద్ధ చిత్రకారుని బలి చేసింది. ఆ వ్యక్తి యెలా యీలోకానికి దూరమయ్యాడో అతని కళకూడా దూరమయింది. అతను వేసిన చిత్రాలన్నీ మాసిపోయాయి. కానీ తనగదిలో చిత్రాలు మటుకు కళతగ్గలేదు. వాటి ప్రక్కనే చెయ్యానులు ఆ చిత్రకారుని రూపు చిత్రించుకున్నాడు. అటువంటి చిత్రకారుని తను పోగొట్టుకున్నందుకు తనజీవితం వ్యర్థమనుకున్నాడు. ఆ చిత్రకారుని దరితీసి పైకితీసుకురాలేని రాజపోషకులు యీ లోకంలో యెంతమంది వున్నారో వారినందరినీ దూషించాడు. .

చెయ్యానులు ఆ చిత్రకారుని ఆశయాన్ని తను నెరవేర్చదలచుకున్నాడు. అతను జీవిత గాధను లోకానికి తెలిపితే అతని ఆత్మకు శాంతి కలుగుతుందనుకున్నాడు. తనకు దోవలో యెవరెదురైనా వారిని తన గదికి ఆహ్వానించేవాడు. తనగదిలోని చిత్రాలను చూపేవాడు. ఆ చిత్రాలను చూచినవారు కదలిపోయే వారుకాదు. వారికి ఆ చిత్రకారుని విషాదగాధ తెలిపి రెండు కన్నీటి చుక్కలు వదిలేవాడు. ప్రతి దినం అతనికిదొక విధ్యుక్త కర్తవ్యమయింది. ఆ చిత్రాలను, ఆ చిత్రకారుని తనెలా లోకానికి పరిచయం చేయగలనోనని యెప్పుడూ ఆలోచించేవాడు. దానికి తగిన శక్తినిమ్మని దేవుని సర్వ విధాలా ప్రార్థించేవాడు. ఆ చిత్రకారుని ఆత్మ శాంతికి తను దినం దైవప్రార్థన సలిపేవాడు.

చెయ్యానులు యిప్పటికీ అలానే చేస్తున్నాడు. అదే అతని హృదయభారాన్ని తీసివేయగలుగుతుంది.